# రమ్మీ

## నందం రామారావు

‘‘ఏవండీ’’ అన్నది సుమతి భర్తకు కాఫీ ఇస్తూ.

కాఫీ అందుకుంటూ ఏవిటన్నట్టుగా చూశాడు వేణు.

‘‘ఇవేళ ఆఫీసు నుంచి పెందరాడే వచ్చేయండి ఫస్టుషోకెడదాం!’’

‘‘ఇదేదో! బావుంది. ఈ రోజు శనివారం తెలుసా?’’

‘‘తెలుసునండి. ఎప్పుడూ వుండేదేగా ఆ పేకాట. ‘విడని బంధాలు’ ఇవాల్టితో వెళ్ళిపోతుందట. ఏ రోజుకారోజు ఆ సినిమాకెడదామంటూ గడిపారు. ఇప్పుడేమో ఆ సినిమా వెళ్ళిపోతోంది. నేవభిమానించే నా హీరోయిన్ సినిమా చూడకపోతే ఎలాగండి. పైగా, నేనా సినిమా చూళ్ళేదని తెలిస్తే నా హీరోయిన్ తెగ బెంగపడిపోతుంది. నా సినిమా చూశావా అంటూ రేపో, ఎల్లుండో ఫోన్ కూడా చేస్తుంది.’’

భార్యమాటలకు వేణు నవ్వుతూ ఉండిపోయాడు.

‘‘మీకలా నవ్వులాటగానే ఉంటుంది. ఈ ఒక్క శనివారానికే మీరు పేకాడ్డం మానెయ్యలేరే. మరి, ఆ సినిమా చూడకపోతే నాకెలా ఉంటుంది?’’

‘‘ఇదిగో సుమతీ! మీ హీరోయిన్ నీకేం ఫోన్ చెయ్యదు కానీ, ఒకవేళ ఫోన్‌చేస్తే ఆ సినిమా దేశంలో ఎక్కడాడుతున్నా నిన్ను తీసుకెళ్ళి చూపిస్తాను. సరేనా! ఎంచక్కా హాయిగా భోజనం చేసి పడుకో!’’

‘‘అవును. నేనీ ఇంట్లో ఒక్కదాన్నే పడుకుంటే మీరు తెల్లవార్లు పేకాడి ఇంటికొస్తారు. ఏవిటో బాబూ మీ వరసలు నాకేం నచ్చడం లేదు.’’

‘‘శ్రీమతీ! ఓ పనిచేద్దామా?’’

‘‘మీరు చెకటి కాదు. వంద చెయ్యండి. నేను మాత్రం ఆ సినిమాకెళ్ళ వలసిందే!’’

‘‘నువ్వలా మీ హీరోయిన్ పిక్చర్ ఫ్లైలయినట్టు ముఖం పెట్టకు. నువ్వు సాయంత్రం నేరుగా పిక్చర్‌కు వెళ్ళిపో. నేనీలోపల రెండు రౌండ్లు ఆడి, పిక్చర్ వదిలే టైమ్‌కు థియేటర్‌కు వచ్చి నిన్ను ఇంటికి తీసుకెడతాను. ఓ.కె. ఇద్దరి పనులూ జరుగుతాయి.’’

‘‘ఆ... మనుషుల్ని బోల్తా కొట్టించడంలో మీకు మీరే సాటి.’’

‘‘మరయితే నేను ఆఫీసు కెడతాను. మన మామూలు సంగతేవిటి?’’ అంటూ వేణు, భార్యను దగ్గరకు తీసుకోబోయాడు.

‘‘ఇవేళ శనివారం. నిషేధం. ముద్దు పెట్టుకోవడానికైతే శనివారం గుర్తుండదు గానీ పేకాటకైతే గుర్తుంటుంది’’ అంటూ సుమతి భర్తని విడిపించుకుంది.

‘‘ఏవిటో నీ లెక్కలు. సరే కానిమ్ము దేవీ. ఈ ముద్దు కార్యక్రమాన్ని జయప్రదం చేయడం రేపటికి వాయిదా వేసితిని’’ అని అంటూ వరండాలో వున్న స్కూటర్ దగ్గరకెళ్ళాడు వేణు.

వేణు ఆఫీసుకెళ్ళగానే సుమతి ఒంటరిదైపోయింది. అప్పటికి టైమ్ ఉదయం పదిగంటలే ఐనా ఇక చెయ్యవలసిన పనంటూ ఏమీ లేకపోయింది. సుమతికి పెళ్ళయి దాదాపు పదేళ్ళు దాటింది. మంచి భర్త, మంచి ఉద్యోగం. అంతకు మించి మంచి మనసు. ఎందరికోగానీ లభ్యం గాని అనువైన సంసారం.

కానీ, ఇంత పెద్ద ఇంట్లో సందడనేదే లేదు! చిరుపాదాల మువ్వల సవ్వడి లేదు.

భర్త ఆఫీసుకు వెళ్ళగానే ఒంటరిదై దిగులుగా, ఏం తోచక పిల్లల క్యాలండర్ల కేసి చూస్తుండిపోయేది.

రాత్రయితే నాలు దీపాల వెలుగులో బోసినవ్వులతో మురిపించే పిల్లలులేక, అర్ధరాత్రి స్మశానంలో వైరాగ్యంతో తిరుగాడుతున్న జీవిలా ఉండిపోయేది.

సుమతి— స్త్రీ సహజమైన కోరికలతో, ఆశలతో పిల్లల కోసం ఎందరో దేవుళ్ళకు పూజలు చేసింది. మొక్కుకుంది. పూజలకు, మొక్కుబడులకు డబ్బైతే ఖర్చయింది కానీ పిల్లలు పుట్టలేదు!

* * *

సినిమాహాల్లో భర్త ప్రక్కన లేకపోయినా సుమతి ఆ సినిమా చాలా ఆనందంగా చూడగలుగుతుంది. తన అభిమాన హీరోయిన్ ఎంత చక్కగా చేస్తోంది. అబ్బా! అంత వయస్సులో కూడా ఎంతో అందంగా వుండి సుమతి సినిమా చూస్తున్న టైమ్‌లో ఇక్కడ—

సుమతి భర్త వేణు స్నేహితుని ఇంట్లో లరుగురితో కలిసి మహాజోరుగా పేకాట ఆడుతున్నాడు.

అప్పుడే మరోసారి ‘టీ’లు వచ్చాయి.

వేణు టీ త్రాగుతూ ఈ సారైనా ఎలాగైనా సరే ఆట తిప్పాలనుకున్నాడు. అప్పటికే నాలుగు కౌంట్లు, రెండు మిడిల్ డ్రాప్స్ ఇచ్చాడు.

సినిమాహాల్లో అప్పుడే విశ్రాంతి చేశారు. కొద్దిపాటి వెలుతురులో తనకు తెలిసిన వారెవరైనా వచ్చారేమోనని చుట్టూ చూసింది సుమతి. ఇంత వరకూ తన అభిమాన నటి ఎంత గొప్పగా చేసిందీ, ఎన్నెన్ని నుంచి చీరలు కట్టిందీ వరుసగా ఎవరికైనా చెప్పాలని మహా ఇదైపోతోంది. కానీ, ఏం లాభం? తెలిసిన వారు ఒక్కరూ కనిపించలేదు. అక్కడికీ ఉండబట్టలేక ప్రక్కనున్నావిడని.

‘‘ఎలా ఉందండీ సినిమా?’’ అని అడిగింది.

ఆవిడగారు సుమతిని ఎగాదిగా చూసి—

‘‘బాగానేవుంది’’ అని అన్నది.

‘‘బాగానే ఏవిటండీ. ఎంతో గొప్పగా ఉంది. చూశారా ఆ హీరోయిన్ ఎంత గొప్పగా చేసిందో.’’

ఆవిడ కళ్ళజోడు లోంచి సుమతిని మరోసారి చూసి ఏం మాట్లాడకుండా ఊరుకుంది.

అక్కడ—

వేణు అందరికీ ముక్కలు పంచుతూ— ‘‘జాక్‌పాట్ నాకు పడితే గ్యారంటీగా ఆట నేనే కొట్టేస్తాను’’ అని అనుకున్నాడు.

ముక్కలు పంచడం పూర్తయ్యింది. ముక్కల్ని ఎత్తబోతూ వాచీ చూసుకున్నాడు. ఎనిమిద గంటలు దాటింది. అబ్బో! ఇంకా ఫస్ట్ షో వదలడానికి చాలా టైముంది అని అనుకున్నాడు.

వేణుకి జాక్‌పాట్ రాలేదుగానీ, ఒక కలర్, ట్రిప్లెట్ పడింది.

ప్రక్కనున్న బ్యాంక్ మేనేజర్ గారు ముక్క పడేశారు. వేణు ఆ ముక్కను ట్రిప్లెట్‌కు ఎత్తుకుని ఆట ఆడాడు.

ఈ ఆటను ఎలాగైనాసరే గెలుస్తానన్న ధీమా వేణుకి బాగా ఉంది.

పేకాటకు ఆ మాత్రం ధీమా లేకపోతే మహా

కష్టం కదా!

కానీ, పాపం! వేణు క్రింద ముక్కకు వెళ్ళకుండా పేకలోకి వెడితే జాక్‌పాట్ వచ్చేది! జస్ట్! కొద్దిలో అతనికి అదృష్టం తప్పిపోయింది. జస్ట్! కొద్దిలో, ఇక్కడ హీరోయిన్‌కి కూడా అదృష్టం తప్పిపోయింది! ఇక ముందు ఏం జరుగుతుందో కూడా తెలియనంత సస్పెన్స్‌గా సినిమా నడుస్తోంది.

సుమతి ఊపిరి బిగపట్టింది. ఏ క్షణంలోనైనా ఆమె కళ్ళనుండి నీళ్ళు జారటానికి సిద్ధంగా ఉన్నాయి. అంత పెద్ద హాల్లోవున్న జనమంతా నిశ్శబ్దంగా సినిమా చూస్తున్నారు.

హీరోయిన్ మాత్రం మహా బరువుగా డైలాగ్ చెబుతోంది. కొన్ని వందల లీటర్ల కన్నీళ్ళు మాత్రం గ్లిసరిన్ లేకుండానే చెంపల మీదుగా జారిపోతున్నాయి.

"ఛీ! జాక్‌పాట్ కౌంట్ పడింది. ఏవిటో ఈ వేళలో అన్నీ కౌంట్లే" అంటూ వేణు ఓకులు లెక్కపెట్టసాగాడు.

"ఒక్కోసారి అంతే వేణు. ఎంత మంచాటకైనా కౌంట్లు తప్పవ్! అని అంటూ తనూ ఓకులు లెక్కపెట్టసాగాడు ఓ సెక్షన్ ఆఫీసర్."-

ఈ ఆట షో వేసి సినిమా హాలు దగ్గరకెడతామనుకున్నాడు వేణు. కానీ, కౌంట్ ఇచ్చాడు. అంచేత, అతను అక్కడనుంచి కదల్లేదు. 'షో చెయ్యాలి' ఇక్కడ నుంచి కదలాలి' అని అనుకున్నాడు. సిగరెట్టు తీసి వెలిగించి గట్టిగా దమ్ములాగాడు.

ఇదిగో! ఈ ఆట షో వేసి వేద్దామనుకుంటూనే టైమ్ గడిచిపోయింది. ఎంత టైమ్ గడిచిందో తెలియలేదు!

అప్పటి సినిమా వదిలి పెట్టెయ్యడం, సుమతి బయటకొచ్చి ఒక మూలగా నుంచోవడం కూడా జరిగింది. సినిమాకొచ్చిన జనం అంతా వెళ్ళిపోయారు. రెండో ఆట కొస్తున్న జనం పలచగా ఉన్నారు. సుమతి సినిమా హాలు దగ్గరకొస్తున్న ప్రతి మనిషినీ, తన భర్తే అనుకోసాగింది. భర్త ఎంతకీ రాకపోవడంతో, వస్తాడనే ఆశతోనే అలా ఎదురుచూస్తూ నుంచునే ఉంది!

ఇక్కడ వేణు ఇంతవరకూ ఒక్క ఆట కూడా షో చెయ్యలేదు. కౌంట్ల మీద కౌంట్లు పడుతున్నాయి. ఆట వ్యామోహంలో పడి భార్య సినిమాకెళ్ళిందనే సంగతే మరిచిపోయాడు.

మళ్ళీ మరోసారి టీలు వచ్చాయి. వేణు టీ తాగుతూ ప్రక్కనున్న పెద్దమనిషిని టైమ్ అడిగాడు. ఆ పెద్ద మనిషి వేణుని ఓసారి చూసి పదకొండు దాటిందన్నాడు.

అంతే! వేణు ఒక్కసారిగా ఉలిక్కిపడి, భార్య సినిమాకెళ్ళిందనే సంగతి అప్పటికి గుర్తురాగా— 'ఆట' వదిలేసి గబగబా స్కూటరేసుకుని హాలు దగ్గరకెళ్ళాడు.

భర్త ఎంతకీ రాకపోవడంతో సుమతికి ఎక్కడలేని నీరసం వచ్చేసింది. "అసలీయన మనిషేనా?" అంటూ విసుక్కుంది. జనం అంతా వెళ్ళిపోయారు. రెండో ఆట కూడా మొదలుపెట్టడం వల్ల రిక్షాలు కూడా లేవు. నలుగురైదుగురు వ్యక్తులు సుమతి ఏ జాతో తెలియక ఆశగా అటూ ఇటూ తిరిగసాగారు.

సినిమా హాలులోంచి ఇంటికి నడిచి వెళ్ళాలంటే కనీసం అరగంట పడుతుంది. హాలు దగ్గర రిక్షాలు లేవు. నడిచి వెళ్ళక తప్పదు. సుమతి సినిమాహాలు ఆవరణ లోంచి బయటకొచ్చి నడవసాగింది. హడావుడిగా దగ్గరకొచ్చిన వేణుకి భార్య కనిపించలేదు. ఓసారి ఆవరణంతా కలయచూశాడు. కలయచూసిన తర్వాత తనలో తానే నవ్వుకున్నాడు. ఐనా, ఇప్పటివరకూ భార్య హాలు దగ్గర



ఉంటుందని తనెలా అనుకున్నాడు. తను రాకపోవడంతో చూసి ఇంటికి వెళ్ళిపోయి ఉంటుంది'' అని అనుకున్నాడు.

వేణు సిగరెట్టు వెలిగించి స్కూటరు స్టార్ట్ చేసి మళ్ళీ పేకాట గృహానికి బయలుదేరాడు.

సుమతి ఓ ఫర్లాంగు దూరం నడిచి వచ్చిందో లేదో హఠాత్తుగా కరెంటు పోయింది. నడుస్తున్న ఆమె లిప్తకాలం ఆగి మళ్ళీ నడవసాగింది. అసలే అమావాస్య చీకటి కావడం వల్ల ఎక్కడ ఏం ఉందో తెలియడం లేదు. ఇంకా సుమతి నడుస్తూనే ఉంది.

ముఖమంతా చెమట పట్టడం వల్ల పమిటకొంగుతో తుడుచుకుంది. కాళ్ళు, చేతులూ వణుకుతున్నట్టనిపించింది. ఎందుకో అకారణంగా గుండె వేగంగా కొట్టుకోసాగింది. అడుగులు తడబడుతున్నాయి. ఎవరింటి తలుపైనా తట్టి ఈ రాత్రికి అక్కడే ఆశ్రయం పొందాలని కూడా ఆశించింది. ఒకవేళ తలుపులు తెరిచినా ఆ ఇంటి వారు మంచివారైతే సరేసరి. లేకపోతే...

ఈ భావం రావడంతో సుమతి మరీ బిగుసుకుపోయింది. భయంగా పెద్దగా అరవాలనుకుంది. గొంతు పెగల్లేదు. ఐనా, తనకు తానుగా ధైర్యం తెచ్చుకుని, తన అభిమాన హీరోయిన్ని గుర్తు తెచ్చుకుని నడవసాగింది.

''ఏయ్ ఆగు''

ఆ మాటలినబడ్డం తోనే సుమతి అడుగు ముందుకు వెయ్యలేకపోయింది.

రెండు ఆకారాలు మాత్రం దగ్గరకు రావడం తెలుస్తోంది.

''ఎవరండీ మాట్లాడరే?''

అప్పటికే సుమతి మాట్లాడలేకపోయింది.

''లైటు వెయ్యరా!''

బ్యాటరీ లైటు వెలిగింది.

ఆ వెలుగులో తలొంచుకుని నిలబడిన ఒక యువతిని చూడగానే ఆ ఇద్దరు వ్యక్తులూ మహానందపడిపోయారు.

''ఇంతరాత్రి ఎక్కడ నుండి వస్తున్నావు?''

''సినిమాకెళ్ళి''

''ఇప్పుడా సినిమా వదిలి పెట్టింది?''

''మా వారు హాలు దగ్గరకొస్తానన్నారు. ఇప్పటివరకూ చూసి ఆయన రాకపోతే ఇంటికెడుతున్నాను.''

ఆ ఇద్దరు వ్యక్తులూ కిసుక్కున నవ్వారు.

''ఇటువంటి మాటలు మేం ఎప్పుడూ వినేవే. అని మనసులో అనుకున్నారు.

''మీకు పుణ్యముంటుంది. దయచేసి నన్ను ఇంటిదగ్గర దిగబెట్ట గలరా?''

ఒక అబల, అర్ధరాత్రి సమయంలో ఇద్దరు రక్షకభటులను వేడుకుంటుంది.

అవును నువ్వొక్కదానివే ఇంటికెళ్ళడం ప్రమాదం. మీ ఇల్లెక్కడో చెప్పు. దిగపెడతాం.''

ఆ మాట వినడంతోనే సుమతి హాయిగా ఊపిరి పీల్చుకుంది. ఆ చీకటిలో, ఒంటరిగా, బిక్కుబిక్కుమంటూ ఇంటికి ఎలా వెళ్ళాలో తెలియక తల్లడిల్లిపోతున్న సమయంలో, ఇద్దరు దేవుళ్ళు తనని రక్షించడానికొచ్చారు.

చెరోవైపు ఆ ఇద్దరూ నడుస్తూ ఉండగా మధ్యన సుమతి నడవసాగింది.

ఒక రాజకన్యను సకల రాజలాంఛనాలతో ఉత్సవానికి తీసుకెడుతున్న విధంగా సుమతి నడవసాగింది.

ఇప్పుడు తనకేం భయం లేదు!

హాయిగా ప్రశాంతంగా ఇంటికి చేరుకోగలను.

ఇంతకుముందు ఎంత భయపడిందో ఇప్పుడంత సంతోషపడుతోంది.

'అయ్యో మొగుడు గారూ! మీరు సినిమా థియేటర్ దగ్గరకు రాలేదనే కోపంతో ఇంతకు ముందు వరకూ మిమ్మల్ని అతి దారుణంగా ఒక తిట్టుకాకుండా తిట్టాను. ఓ పతిదేవా! నన్ను క్షమించండి. మీరు హాపీగా తెల్లార్లు పేకాడి ఇంటికి రండి! అని మనసులో అనుకుంది సుమతి.

నడుస్తోంది—

తాపీగా, ఠీవీగా, ఉల్లాసంగా.

పది అడుగులు వేసింది. పది కాపోతే పదిహేను అడుగులు వేసిందో లేదో సుమతి జడుసుకున్నట్టుగా ఉలిక్కిపడింది.

ఆ రక్షక భటుల్లో ఒక భటుడు సుమతి భుజం మీద చెయ్యి వేశాడు.

మరో రక్షకభటుడు ఆమె వంటి మీద చెయ్యేసి సుఖాల కోసం ప్రాకులాడుతున్నాడు.

సుమతి భయపడిపోయి కెవ్వున అరవబోయింది.

అప్పటికే ఆమె నోటిని మూసేశారు.

తనకేం జరుగుతుందో తెలుసుకునేంతలో— అంతా జరిగిపోయింది

★ ★ ★

తెల్లారుతుండగా వేణు ఇంటికొచ్చి, ఇంటికి తాళం వేసి ఉండడం చూసి ఆశ్చర్యపోయాడు.

ఇంటి ప్రక్కన వారి నడిగితే—

''మీ భార్యాభర్తలిద్దరూ కలిసి ఎక్కడికైనా వెళ్ళారోమోనని అనుకున్నాం. మరైతే సుమతి ఏది?'' అంటూ ఎదురు ప్రశ్న వేశారు.

ఈ మాట వినడంతోనే వేణు నిలువునా కంపించిపోయాడు. కాళ్ళూ, చేతులూ ఆడలేదు. భార్య ఏమైందో తెలియక పిచ్చివాడిలా వెదకి తిరిగి తిరిగి చివరకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళాడు.

★ ★ ★

నేరం చేయకపోయినా, చేసినట్టుగా సృష్టించి ఇది నిజమేనన్నట్లు అనిపించే విధంగా గారడి చేయడం సామాన్య విషయం కాదు.

కోర్టు హాల్లోనూ, బయటా జనం విపరీతంగా ఉన్నారు.

ఒక యువతి బోనులో తలొంచుకుని నిలబడి వుంది.

ఆమె పేరు సుమతి.

''పెళ్ళయి దాదాపు పదిసేను సంవత్సరాలు దాటినా ఆమెకు పిల్లలు పుట్టలేదు. పిల్లలు పుట్టలేదనే బెంగతో భర్తను అలక్ష్యం చేసి, పిల్లలు పుట్టడం కోసం అనేకమందితో ఈ సుమతి తిరగడం మొదలుపెట్టింది. నిన్నరాత్రి ఒక విటుడుతో ఒక వేశ్యా గృహంలో ఉండగా పట్టుబడిన ఈమెకు ఏ జరిమానా విధిస్తారో విధించవలసిందిగా కోర్టువారిని కోరుతున్నాను'' అంటూ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ గారు ఏకధాటిగా చెప్పిన మాట చెప్పకుండా చెప్పారు.

ఈ మాటలు సుమతి విన్నదో లేదో తెలియదు గానీ అప్పటికే ఆమె బోనులో స్పృహతప్పి పడిపోయింది.

''ఇదంతా కట్టుకథ— పోలీసులు పన్నిన పన్నాగం. మీరంతా దొంగలు'' అంటూ అరవసాగాడు.

ఇక అతని మాటలు ఎవరికీ వినిపించలేదు.

ఎందుకంటే— వేణుని అప్పటికే పోలీసులు బయటకు లాగేశారు.

ఒక సామాన్య మనిషికి ఇదీ ఈ దేశంలో జరుగుతున్న న్యాయం! ●

**చెపుతాను**

''రాణీ మనం తొందరగా పెళ్ళి చేసుకుందాం''

''అలాగే మోహన్, మా ఇంట్లో అడిగి చెపుతాను.''

''అదేంటి నీకెవరూ లేరన్నావుగా, మరీ ఎవరిని అడిగేది.''

''మా ఆయనను'' ఆర్. విజయకుమార్